సాక్షి రంగారెడ్డి

సోమవారం, 2, అక్టోబర్, 2023



నేడు 'డబుల్' ఇళ్ల పంపిణీ

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేయనున్నారు. 8లో▸



లాభాల తోట

అధిక లాభాలు వచ్చే కూరగాయల పంటలు, పండ్ల తోటల సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. 8లో▸



స్వచ్ఛత అందరి బాధ్యత

పరిసరాలతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. 8లో▸

చెంతకే వైద్య సేవలు

- కాన్పులు, ఇతర చికిత్సలకు హైదరాబాద్ వెళ్లాల్సిన పని లేదు
- మెడికల్ కాలేజీ కందుకూరు మండలానికి ఓ వరం
- మహేశ్వరం నియోజకవర్గానికి కేసీఆర్ ఇచ్చిన బహుమానం
- ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ మాదే అధికారం
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



కందుకూరు: మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/కందుకూరు: 'గతంలో ఏ నొప్పి వచ్చినా.. రోగం వచ్చినా ఉస్మానియాకు వెళ్లేవారు.. బిడ్డ కాన్పు కోసం అర్ధరాత్రి పేట్లబురుజుకు పరుగెత్తే వాళ్లు.. ఇక అలా వెళ్లాల్సిన అవసరం లేదు.. ఏ జబ్బు వచ్చినా హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు.. మీ వద్దకే ఆస్పత్రి రాబోతోంది. మెడికల్ కాలేజీ మాత్రమే కాదు అనుబంధ ఆస్పత్రి, వైద్య నిపుణులు అందుబాటులోకి రాబోతున్నారు.. కేన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ, ఇలా ఏ జబ్బు వచ్చినా ఇక్కడే వైద్యం అందుతుంది' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో రూ.176 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించత లపెట్టిన మెడికల్ కాలేజీ భవనానికి ఆదివారం ఆయన మంత్రి సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు.

కందుకూరుతో అనుబంధం..

దాసర్లపల్లిలో తనకు కూడా 20 ఎకరాల భూమి ఉండేదని, ఇక్కడ చాలా మందితో కలిసి పని చేశానని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మండలంతో తనకు చాలా అనుబంధం ఉందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఇక్కడ మెడికల్ కాలేజీని ప్రారంభించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మెడికల్ కాలేజీ కందుకూరు మండలానికి ఓ వరమని.. మహేశ్వరం నియోజకవర్గానికి కేసీఆర్ ఇచ్చిన బహుమానమని పేర్కొన్నారు. మంత్రి సబితమ్మ పట్టుబట్టి.. వైద్య ఆరోగ్యశాఖను ఒప్పించి మెడికల్ కాలేజీ తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ పారి శ్రామిక మౌలిక సదుపాయాల సంస్థను ఒప్పించి కాలేజీకి అవసరమైన భూమిని ఇప్పించారన్నారు. నాడు ఇంద్రన్న ఎట్లయితే ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కృషి చేశారో.. నేడు సబితమ్మ అదే విధంగా చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఒక్క డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదని.. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ మూడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వచ్చాయని గుర్తు చేశారు.

కాంగ్రెస్‌ను నమ్మితే అంతే..

పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించామని, కాలువ పనులు పూర్తయి.. త్వరలోనే సాగు నీరు రాబోతోందన్నారు. ఒకవైపు వ్యవసాయం, మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో యాభై వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని చెప్పారు. మాయమాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ అంధకారం తప్పదన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని తీర్మానాలు చేసినా.. ప్రజలంతా క్లారిటీతో ఉన్నారన్నారు. అభివృద్ధి కావాలంటే సబితమ్మనే మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్‌లు జ్యోతి, సరళమ్మ, ఎంపీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

పహాడీషరీఫ్: కుల, మత, ప్రాంతాలకతీతంగా .. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో 12 కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు ఆదివారం ఆయన మంత్రి సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మినీ ఇండియాగా ఉన్న శ్రీరాం కాలనీలో ఇతర రాష్ట్రాల ప్రజలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి.. కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌కే దక్కిందన్నారు. కొన్ని పార్టీల నాయకులు రియల్‌ఎస్టేట్ సొమ్ముతో టికెట్లు కొని గెలుద్దామని పగటి కలలు కంటున్నారని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నాయకుడు పది కోట్ల విషయాన్ని బహిర్గతం చేశారన్నారు. అలాంటి వారికి ఓట్లు వేస్తే రాష్ట్రాన్ని, భూములను అమ్మేస్తారన్నారు. ప్రధాని మోదీ ఎందుకు వస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన యూనివర్సిటీ మంజూరు చేయకపోవడం బాధాకరమని.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కృష్ణా బోర్డు సమస్యలు తేల్చలేని స్థితిలో ఉన్నారన్నారు. బీజేపీకి రెండు సీట్లే వస్తాయని ఆ పార్టీకే చెందిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెబుతున్నారని.. ఆ పార్టీకి ఓట్లు వేస్తే మోరీలో వేసినట్లేనన్నారు. శ్రీరాం కాలనీ వాసుల సౌకర్యార్థం యూపీహెచ్‌సీ, జల్‌పల్లి మున్సిపల్ ప్రజల కోసం 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. విజన్ కలిగిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలను అక్కున చేర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచంద్, పార్టీ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో సుడిగాలి పర్యటన

ఆమనగల్లు: పట్టణంలో ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం మధ్యాహ్నం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొద్దిసేపు సుడిగాలి పర్యటన చేశారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.17.50 కోట్లతో నిర్మించే భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డితో శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్లతో నిర్మించిన మోడల్ లైబ్రరీ భవనాన్ని ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.10 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయుష్‌చక్ర సంచార వైద్యశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ కమటం రాధమ్మ, జెడ్పీటీసీలు అనురాధ, ఉప్పల వెంకటేశ్, విజితారెడ్డి, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావు, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావ్, డీసీహెచ్ రాజు, తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- 2040 నాటికి నగరం కార్బన్ డయాక్సైడ్ రహితం
- భవిష్యత్ తరాలకు సైక్లింగ్ అలవాటు చేయాలి
- గండిపేట చుట్టూ సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తాం
- స్టేటస్ సింబల్‌గా వాహనాలను పెంచుతున్నారు
- వాహన రహిత ప్రయాణాలకు ప్రాధాన్యమివ్వాలి
- సైకిల్ ట్రాక్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

మణికొండ: ప్రపంచమంతా ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి వాహన రహిత ప్రయాణాల వైపు వెళ్తోందని, హైదరాబాద్‌ను 2040 నాటికి కార్బన్ డయాక్సైడ్ రహిత నగరంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం రాత్రి ఔటర్ రింగ్ రోడ్డు వెంట 23 కిలో మీటర్ల మేర ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. నగరంలో సైక్లింగ్ జోన్లలో ఇది ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో కోకాపేట నియోపోలిస్, గండిపేట చెరువు చుట్టూ, బుద్వేల్ సెజ్ వరకు ఏర్పాటు చేస్తామన్నారు. మధుమేహం, బీపీ బాధితులు సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. మన దేశంలో డబ్బు వస్తుంటే స్టేటస్ సింబల్‌గా వాహనాలను పెంచుతున్నారని, ఇతర దేశాల్లో ప్రజా రవాణానే ఎక్కువగా వినియోగిస్తారని గుర్తు చేశారు. ప్రజా రవాణాను పేదలే వాడాలనే ధోరణి పోయి అందరూ వాడే రోజు రావాలని ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలను ఆరోగ్యంగా ఉంచాలంటే మన పిల్లలను సైక్లింగ్ వైపు ప్రోత్సహించాలని సూచించారు.

దేశంలోనే మొదటిది..

2022వ సంవత్సరంలో హైదరాబాద్‌లో సైక్లింగ్ జోన్ ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ సభ్యులు తనను సంప్రదించారని, దక్షిణ కొరియాలో సోలార్ ప్యానెల్ కవర్ సైకిల్ ట్రాక్ ఉందని కనుగొని అక్కడకు అధికారులను పంపి నివేదిక తెప్పించుకుని పనులు మొదలు పెట్టామని కేటీఆర్ అన్నారు. సంవత్సర కాలంలో మొదటి విడతగా 23 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధమైందన్నారు. ఇది 365 రోజులు 24 గంటల పాటు తెరిచి ఉంటుందన్నారు. మన దేశంలో ఇదే మొదటిదని, ప్రపంచంలోనే రెండోదన్నారు. ప్రస్తుతం దుబాయ్, స్విట్జర్లాండ్‌లలో నిర్మిస్తున్నారని తెలిపారు. సైకిల్ ట్రాక్‌కు రెండు వైపులా రక్షణ, భద్రత ఏర్పాట్లు ఉన్నాయని, సైకిల్ ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌లతో 16 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. దీని వెంట పార్కింగ్, విశ్రాంతి ప్రాంతాలు, ప్రథమ చికిత్స స్టేషన్లు, ఫుడ్ స్టాల్స్, సైకిల్ రిపేర్, రెంటల్ స్టేషన్లు, అయిదు చోట్ల యాక్సెస్ పాయింట్లు ఉంటాయని పేర్కొన్నారు. ఫేజ్ -2లో నార్సింగి హబ్‌లో స్కేటింగ్ రింక్‌లు, టెన్నిస్ కోర్టులు, బ్యాడ్మింటన్ కోర్టులు, స్పోర్టింగ్ రిటైల్, క్రీడా సౌకర్యాలను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందన్నారు.

గిన్నిస్ రికార్డు సృష్టిస్తాం..

హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్, హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్ ఆధ్వర్యంలో 2024లో ఒకేసారి 3వేల మంది సైక్లిస్టులతో గిన్నిస్ రికార్డు సృష్టించాలని నిర్ణయించినట్లు ఆయా గ్రూపుల నిర్వాహకులు సెల్వన్ సంతాన, రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ బి.ప్రభాకర్, హెచ్‌జీసీఎల్ సీజీఎం రవీందర్, నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్ యాదవ్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, సైక్లిస్టులు తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ట్రాక్‌ను ప్రారంభించి సరదాగా సైకిల్ తొక్కుతున్న మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి

న్యూస్‌రీల్

సినీనటి కీర్తి సురేష్ సందడి



జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేష్

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ ఫ్యామిలీ మాల్‌ను ప్రముఖ సినీనటి కీర్తి సురేష్ ఆదివారం ప్రారంభించారు. ఆమెను చూడటానికి స్థానిక ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ మాట్లాడుతూ.. బాలాపూర్ పరిసర ప్రాంత ప్రజల కోసమే అంతర్జాతీయ షాపింగ్ అనుభూతి కలిగించేలా ఐదంతుస్తుల్లో షాపింగ్ మాల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. మార్కెట్ ధరలకన్నా తక్కువకు వస్త్రాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 9న కళాశాలలో వాక్ ఇన్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా 'గోలి' బాధ్యతల స్వీకరణ



గోలి శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న ఫుడ్ కమిషన్ కార్యాలయం అధికారులు

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఉన్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



ఆమనగల్లులో ముస్లింల ర్యాలీ

ఆమనగల్లు: పట్టణంలో ఆదివారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జామై మసీదు వద్ద ర్యాలీని మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూంతో కలిసి సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అంతకు ముందు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామ మసీదు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రాం, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్: ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు పట్టణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన రాజు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఎంతోకాలంగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్‌ను నెలకు రూ.వెయ్యి చొప్పున 16నెలల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అప్పుడు ప్రాణాలు తీశాడు.. ఇప్పుడు ప్రాణం తీసుకున్నాడు

- భార్య, కుమారుడి హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో ఘటన



ధన్‌రాజ్, లావణ్య దంపతులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: అదనపు కట్నం కోసం భార్య, కుమారుడిని హత్య చేసిన నిందితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ధన్‌రాజ్ (35) ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ధన్‌రాజ్ మార్చి 15న భార్య లావణ్య (28), కుమారుడు క్రియాన్స్(రెండు నెలలు)ను హత్య చేయడంతో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రెండు నెలల క్రితం బెయిల్‌పై వచ్చిన నిందితుడు బంధువులు వద్ద ఆశ్రయం పొందాడు. వారం రోజుల క్రితం సొంత గ్రామం అనాజ్‌పూర్‌కు వచ్చి తండ్రితో పాటు నివాసం ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథగా మారిన కుమార్తె

తండ్రి చేతిలో తల్లి, తమ్ముడు ప్రాణాలు కోల్పోగా, తండ్రి ధన్‌రాజ్ ఆత్మహత్య చేసుకోవడంతో కుమార్తె ఆద్య అనాథగా మారింది. ఆరు నెలలుగా బండరావిరాలలోని తన అమ్మమ్మ ఇంటి దగ్గరే ఉంటోంది. తండ్రి కూడా తనువు చాలించడంతో ఆద్య ఇప్పుడు ఒంటరి అయ్యిందని స్థానికులు, బంధువులు కంటతడి పెట్టారు.

ఆరోపణలు సహించేది లేదు

పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత




శివగంగ రాజరాజేశ్వర ఆలయం వద్ద అనుచరులతో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత

మహేశ్వరం: అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత హెచ్చరించారు. ఇటీవల కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి మహేశ్వరం టికెట్ కోసం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి రూ.10 కోట్లు, 5 ఎకరాల భూమి ఇచ్చారని చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త మనోహర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్పందించిన పారిజాత మహేశ్వరం శివ గంగ రాజరాజేశ్వర ఆలయానికి రావాలని.. ప్రమాణం చేద్దామని సవాల్ విసిరిన విషయం విధితమే. ఈ క్రమంలో అన్నట్లుగానే ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఆమె తన అనుచరులతో ఆలయం వద్దకు చేరుకున్నారు. 11 గంటల వరకు ఎదురుచూడగా మనోహర్ రెడ్డి రాలేదు. ఆయనకు వ్యతిరేకంగా పారిజాత అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం టికెట్ విషయంలో డబ్బులు, భూమి ఇచ్చినట్లు ఆధారాలుంటే తీసుకొని రావాలని సవాల్ విసిరితే మనోహర్‌రెడ్డి తోకముడిచారని అన్నారు. నోరుందని ఏది పడితే అది మాట్లాడితే జనం నమ్మరన్నారు. అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తే అదే రీతిలో బదులిస్తామని హెచ్చరించారు. మహేశ్వరంలో కాంగ్రెస్ బలోపేతమవుతున్న తరుణంలో కొంతమంది దుష్టశక్తులు పార్టీని బలహీన పర్చాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, బాలు నాయక్, పార్టీ కందుకూరు మండల అధ్యక్షుడు సబావత్ కృష్ణా నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి.. సర్వత్రా ఆసక్తి

- కారు దిగిన 'కసిరెడ్డి'
- నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరిక
- నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలోకి!
- ప్రశ్నార్థకంగా సుంకిరెడ్డి రాజకీయ భవిష్యత్తు
- రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణాలు



కసిరెడ్డి



సుంకిరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో రాజకీయ సమీకరణాలు రోజురోజుకూ మారుతున్నాయి. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం అధికార పార్టీకి షాక్ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. ఈసారి కూడా బరిలో పాతకాపులే ఉంటారని భావించినప్పటికీ ఊహించని విధంగా కసిరెడ్డి కాంగ్రెస్‌లో చేరుతుండడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. కసిరెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో మరింత జోష్ రానుందని భావిస్తున్నారు.

జైపాల్‌యాదవ్ అభ్యర్థిత్వం నేపథ్యంలో..

కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అసంతృప్తికి గురయ్యారు. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా విభేదాలు ఉన్నాయి. కల్వకుర్తి అసెంబ్లీ టికెట్‌ను కసిరెడ్డి 2018లో ఆశించినప్పటికీ బీఆర్‌ఎస్ అధిష్టానం హామీతో పార్టీ విజయానికి కృషి చేశారు. ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా తనకే టికెట్ వస్తుందని భావించిన నేపథ్యంలో అధిష్టానం నిర్ణయంతో ఖంగుతిన్నారు. తన అనుచరులు, అభిమానుల ఒత్తిడితో పోటీ చేయాలని నిర్ణయించారు.

కసిరెడ్డిపై కాంగ్రెస్ గురి..

తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిపై కాంగ్రెస్ గురి పెట్టింది. పార్టీలోకి తీసుకురావడానికి పీసీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి చొరవ తీసుకుని కసిరెడ్డితో మాట్లాడినట్లు సమాచారం. ఆ తరువాత ఏఐసీసీ నాయకులతో మాట్లాడించి కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఇవ్వడానికి హామీ ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. ఇన్నాళ్లు కల్వకుర్తి నుంచి పోటీ చేస్తాడని భావించిన వంశీచంద్‌రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల్లో బిజీగా ఉండడంతోపాటు ఎమ్మెల్యేగా పోటీచేయడం కన్నా ఎంపీగా బరిలో నిలవడానికి ఆసక్తి చూపించనట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కల్వకుర్తి నుంచి బలమైన అభ్యర్థికి అవకాశం ఇవ్వడానికిగాను ఎమెల్సీ కసిరెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఆయన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో భేటీ కావడంతో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైంది.

సుంకిరెడ్డి దారెటు..?

కల్వకుర్తి కాంగ్రెస్‌పార్టీ టికెట్‌ను ఆశిస్తూ నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దారెటు అన్న చర్చ జరుగుతోంది. ఏడాదికాలంగా ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్‌పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్వేలతో టికెట్ కేటాయిస్తే తనకే వస్తుందని ధీమాగా ఉన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి టికెట్ హామీతో కాంగ్రెస్‌లో చేరుతుండటంతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. రెండుమూడు రోజులుగా అభిమానులు, అనుచరులతో ఆయన సమావేశాలు నిర్వహించగా బరిలో ఉండాల్సిందేనంటూ ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కల్వకుర్తిలో కాంగ్రెస్ విజయం కోసం పనిచేయాలని.. అధికారంలోకి వచ్చిన తరువాత సుంకిరెడ్డికి మంచి అవకాశాలు కల్పిస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభయమిచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయన కాంగ్రెస్ విజయం కోసం పనిచేస్తారా..? ఇండిపెండెంట్‌గా బరిలో నిలుస్తారా.. అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

స్వచ్ఛత అందరి బాధ్యత

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

- శ్రీరాంనగర్‌లో శ్రమదానం



కార్యక్రమంలో చీపురు పట్టిన కొండా విశ్వేశ్వరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్: ఇంటి పరిసరాలతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ పిలుపుతో మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి విశ్వేశ్వరరెడ్డి వీధులు, రోడ్లు ఊడ్చి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే దేశం, రాష్ట్రం బాగుంటుందన్నారు. స్వచ్ఛత పాటిస్తేనే రోగాలు దరిచేరవన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా స్వచ్ఛత కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు. అనంతరం పాలమూరులో జరిగే ప్రధాని మోదీ సభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, నాయకులు నర్సింహ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట లడ్డూ రేవంత్‌కు బహూకరణ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం లడ్డూను మాజీ ఉప సర్పంచ్, బడంగ్‌పేట కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి రూ.17 లక్షలకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ లడ్డూను ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి బహూకరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించి అధికారంలోకి రావాలని గణనాథున్ని వేడుకున్నట్లు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుకర్‌రెడ్డి, పుష్పలత, కిరణ్‌గౌడ్ తదితరులున్నారు.



లడ్డూను రేవంత్‌రెడ్డికి బహూకరిస్తున్న వెంకట్‌రెడ్డి దంపతులు

హరీశ్‌రావుకు విన్నపాలు



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం కడ్తాల్‌కు వచ్చిన మంత్రిని పూలమాలతో సన్మానించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, యువసేన రాష్ట్ర నాయకులు మహేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వీరయ్య తదితరులు ఉన్నారు.

లాభాల తోట

- పంటలకు సస్యరక్షణ
- సంప్రదాయ పంటలపై అనాసక్తి
- ఉద్యాన పంటలపై ఆసక్తి
- పండ్లతోటలు, ఆకు కూరలు సాగులో తీసుకోవాల్సిన చర్యలు



టమాట పంటను పరిశీలిస్తున్న సునందరెడ్డి తదితరులు

షాబాద్: ప్రస్తుతం సాగులో పెట్టుబడులు కొండంత.. లాభాలు గోరంత ఉన్నాయి. పైగా ప్రకృతి ప్రకోపానికి పంట చేతికి వస్తుందో? రాదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వ్యవసాయంపై మొగ్గుచూపడం లేదు. వరి, పత్తి, ఇతర సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నారు. అధిక లాభాలు వచ్చే కూరగాయల పంటలు పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటల సాగుకే సై అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యాన తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానశాఖ అధికారి డాక్టర్ సునందరెడ్డి సాక్షితో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

పండ్ల తోటలు...

మామిడిలో కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంటుంది. పురుగు ఆశించిన పక్షంలో బయటకు లాగి చంపివేయాలి. రంధ్రాల్లో మిథైల్ పెరాథియాన్ 50 శాతం మందును 1 మిల్లీ లీటర్ నీటికి కలిపిన ద్రావణం లేదా పెట్రోల్ లేదా అల్యూమినియం ఫాస్పైడ్ బిళ్లలు వేసి బంక మట్టితో మూసివేయాలి.

అరటి సాగులో..

అరటిలో తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకల కోతకు ఉపయోగించే కొడవలిని ప్రతిసారి డీజిల్, కిరోసిన్‌లో ముంచి వైరస్ తెగుళ్ల వ్యాప్తిని నివారించాలి. పచ్చ అరటి, కొవ్వూరు బొంత, కర్పూర చెక్కరకేళి రకాలను రెండో దఫాగా 110 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఇచ్చి తేలికపాటి తడి ఇవ్వాలి.

జామ...

జామ పంటలో కాయలు పెరిగే దశలో నీటి తడులు ఇవ్వాలి. తొడిమ కుళ్లు తెగులు నివారణకు 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలు...

టమాట, వంగ, బెండ సాగులో వైరస్ తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు రసం పీల్చే పురుగులను నివారించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్, ఫ్రిప్రోనిల్, డైమిథోయేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటర్ నీటికి 2మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తీగజాతి కూరగాయలు...

తీగజాతి కూరగాయలను ఆశించే బూడిద తెగులు నివారణకు కెరాథేన్ 1 మిల్లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పండు ఈగ నివారణకు 2 మిల్లీ లీటర్ మలాథియాన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మలాథియాన్ 100 మిల్లీ లీటర్ 100 గ్రాములు చెక్కర లేదా బెల్లం 10 లీటర్ నీరు కలిపి విషపు ఎర తయారు చేసి మట్టి మూకుడులో లేదా ప్లాస్టిక్ పళ్లాలలో పోసి ఎకరాకు 10–12 మూకుడులను అక్కడక్కడ పెట్టాలి.

పసుపు పంట సాగులో

పసుపు పంట పెరుగుదల, నేలలో తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలి. నాటిన 80 రోజులకు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 100 కిలోల వేపపిండితో కలిపి వేయాలి. దుంప ఈగ ఆశిస్తే ఎకరాకు 200 కిలోల వేపపిండితో 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు కలిపి మొక్క దగ్గర వేసి నీరు పెట్టాలి.

నేడు డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్లు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు నేడు పంపిణీ చేయనున్నారు. శంకర్‌పల్లిలో మొత్తం 1,512 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకు 1,361 ఇళ్లను అందించనున్నారు. చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలను చెందిన వారికి 151 ఇళ్లను అందజేయనున్నారు. శంకర్‌పల్లి రెవెన్యూ శాఖ అధికారుల పర్యవేక్షణలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవ ఏర్పాటు కొనసాగుతున్నాయి.

మంత్రి చేతుల మీదుగా పట్టాలు

శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పట్టాలను మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా కలెక్టర్ హరీశ్, జీహెచ్ఎంసీ అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నారు.

'చలో అలంపూర్' విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

శంకర్‌పల్లి: ఈ నెల 4వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప పాదయాత్రను విజయవంత చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం శంకర్‌పల్లి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శివకుమార్, నాయకులు వంశీ, శ్రీకాంత్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్ సందర్శన

అత్తాపూర్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శివరాంపల్లిలోని ఓల్డేజ్ హోమ్‌ను సంబంధిత అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం వారి యోగక్షేమాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బీడీకే, ఎంఎల్‌హెచ్‌పీల మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

శంషాబాద్: అంబులెన్స్‌లోనే ఓ గర్భిణీ ప్రసవించింది. శనివారం అర్ధరాత్రి పట్టణంలోని కాలె పావని (21) పురుటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా.. నొప్పులు ఎక్కువకావడంతో అంబులెన్స్ సిబ్బందే ప్రసవం చేశారు. తల్లిబిడ్డలను నగరంలోని పెట్లాబూర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చేర్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంషాబాద్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ.. మృతిచెందిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుడాకాలనీలో నివాసం ఉండే కుమ్మరి జయమ్మ (43) ఇంట్లో సీలింగ్‌కు ఉరేసుకోగా.. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

శంషాబాద్: పట్టణంలోని వైన్స్ దుకాణంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శంషాబాద్ విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తున్న మధురానగర్ నివాసి కాకర్ల విశ్వేశ్వర్‌రావు (43) ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి వెనకాల ఉన్న సిట్టింగ్ ఏరియాలోకి వెళ్లాడు. మద్యం తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చేసరికే మృతిచెందాడు. మృతుడి తండ్రి మాధవరావు తన కుమారుడి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టాలని ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

రాజేంద్రనగర్: భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి తల్లిగారింటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌కు చెందిన ప్రమీల (30) మొయినాబాద్‌కు చెందిన నందు దంపతులు. కాగా వీరికి ఇద్దరు సంతానం. భర్త తరుచూ భార్యను వేధిస్తుండటంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. వారు కౌన్సిలింగ్ నిర్వహించి పంపించారు. కొన్ని రోజులు బాగానే ఉండి తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో గురువారం ఆమె హనుమాన్‌నగర్‌లోని తండ్రి ఇంటికి వచ్చింది. శనివారం హనుమాన్‌నగర్ ప్రాంతంలోని నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరేసుకుని మహిళ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతురాలు ప్రమీలగా గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరిగింది. పాఠశాల నాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

పోరాటం చేయడమే తప్పా?

- డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి
- నేడు కడ్తాల్ బంద్
- జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్: ప్రజాసమస్యలపై పోరాటం చేయడమే తప్పా అని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రెండు రోజులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. అయితే దీక్షను పోలీసులు భగ్నం చేసి, అరెస్ట్ చేశారు. అరెస్టును ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు గత ఎన్నికల్లో ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీని నేరవేర్చక పోవడంతో దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం కడ్తాల్ బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కృష్ణ, యూసుఫ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల నిర్బంధం



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

కడ్తాల్: మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. సమస్యల సాధన కోసం సమ్మెకు దిగిన వీరి దీక్షా శిబిరాన్ని ఆదివారం ఉదయమే ఖాళీ చేయించి పాలశీతలీకరణ కేంద్రానికి తరలించారు. గేట్‌కు తాళం వేసి బయటకు రాకుండా కట్టడి చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన తెలిపే హక్కు కూడా లేదా ప్రశ్నించారు.

విదేశీ బాట పట్టకండి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

వైద్య వృత్తి పవిత్రమైంది

- పేదలకు వైద్యం అందించండి
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఎంబీబీఎస్ చదివి డాక్టర్లు అయ్యాక విదేశీ బాట పట్టకుండా గ్రామీణ పేదలు, బాధితులకు వైద్యం అందించాలని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఆదివారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో వైద్య విద్యకోసం కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తెలంగాణలో జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఓరియంటేషన్ సందర్భంగా విద్యా, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు సంతోశ్‌రెడ్డి, వరదారెడ్డి, మహేశ్‌కుమార్, రాజిరెడ్డి, జోయారాణి, సత్యనారాయణ, గౌరీ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.